క్లుప్తంగా

సమ సమాజానికి సోషలిజమే మార్గం

గుడివాడ టౌన్: సమ సమాజానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం అక్టోబర్ విప్లవ దినోత్సవం నిర్వహించారు. తొలుత పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ పార్టీలు నవంబర్ 7న జరుపుకుంటాయన్నారు. సోషలిస్ట్ వ్యవస్థ మనిషిని, మనిషి దోచుకునే విధానాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. కనీస అవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి, నివాసం వంటి సమస్యలను సోషలిస్ట్ వ్యవస్థ ద్వారానే సాధించుకోగలమన్నారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.జ్యోతి, సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పామర్రు: జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ ఏ పూర్ణ చంద్రారెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించి ఘన విజయాన్ని సాధించారని తెలిపారు. ప్రథమ స్థానంలో ఇద్దరు, ద్వితీయ స్థానంలో నలుగురు, తృతీయ స్థానంలో 16 మంది విజేతలుగా నిలిచి బంగారు, వెండి కాంస్య పతకాలను, ప్రశంసా పత్రాలను సాధించారని చెప్పారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

మహిళల అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన

పామర్రు: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు, మహిళల అక్రమ రవాణాకు గురైతున్నారని ప్రజ్వల సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ వై.చంద్రయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మండల మహిళా సమాఖ్య పామర్రు సంయుక్త ఆధ్వర్యంలో అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫికింగ్‌కు గురవుతున్న వారిని అప్రమత్తం చేయాలన్నారు. మహిళా హెల్ప్ లైన్స్ 181 చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100, 1930, సైబర్ ట్రాఫికింగ్‌ల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి రజని, ఏపీఎం తిరుపతయ్య, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోలర్ హాకీ పోటీలో ప్రతిభ

గుడివాడ టౌన్: రోలర్ హాకీ స్కేటింగ్ అంతర్ జిల్లా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించినట్లు కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. మంగళవారం విజేతలైన విద్యార్థులను అభినందించారు. లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు తణుకులో జరిగిన 35వ అంతర్‌జిల్లా పోటీల్లో క్యాడెట్ కేటగిరీలో బాలికల విభాగంలో కారుణ్య, దీక్షిక, జశ్రితలు రెండవ స్థానం, బాలుర విభాగం జూనియర్ కేటగిరిలో భాను ప్రణవ్ ద్వితీయ స్థానం సాధించినట్లుతెలిపారు. కోచ్ పీఎస్‌వీఎస్ అయ్యప్పలను స్కూల్ ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీనా, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

పమిడిముక్కల: మండలంలోని 14 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్య తీసుకొంటున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ టీఏలు విజిత, దివ్యభారతి తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం పీఏసీఎస్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కోతలు కోసిన వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు. ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. తేమ 17 శాతం, సేంద్రియ పదార్థాలు ఒక శాతం, అసేంద్రియ పదార్థాలు ఒక శాతం, చెడిపోయిన, మొలకెత్తిన ధాన్యం 5 శాతం, కేళీలు 6 శాతం లోపు ఉండాలన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, కామన్ రకం రూ.2,183 వంతున ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు.

నేలకొరిగిన వరి

కలిదిండి: ఆకస్మిక వర్షాలకు వరి కంకెలు అక్కడక్కడా నేల కొరిగాయి. మండలంలో 1533 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు జరిగింది. శని, ఆదివారాల్లో ఏలూరు జిల్లాలో అత్యధికంగా కలిదిండి మండలంలో 50.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోరుకొల్లు, సాన రుద్రవరం, పలు గ్రామాల్లో అక్కడక్కడా వరి పంటలు నేలకొరిగాయి.

ఏపీకి జగన్ ఎందుకు కావాలో వివరిద్దాం

- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- గుడివాడ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఎందుకు కావాలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. స్థానిక కే కన్వెన్షన్‌లో మంగళవారం శాసన మండలి సభ్యుడు కృష్ణా-గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్‌తో కలిసి గుడివాడ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినఅయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చా రన్నారు. ఈనెల 9వ తేదీన ప్రారంభం కానున్న 'వై ఏపీ నీడ్ జగన్' అనే కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ల పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చారన్నారు. ప్రతి ఒక్క కుటుంబం ప్రభుత్వం తరుపున ఏదో ఒక రూపంలో లబ్ధి పొందిందన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ప్రజలను కోరే హక్కు కేవలం మన కార్యకర్తలకే ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల, వార్డు స్థాయి నాయకులు, గృహ సారథులు బృందాలుగా పార్టీలకు అతీతంగా రోజుకు 20 గృహాలు సందర్శించాలన్నారు. వారు ఏ పార్టీ అనే అంశాన్ని పక్కనపెట్టి ప్రతి గృహాన్ని టచ్ చేస్తే వారు కచ్చితంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందామంటారని, అప్పుడు వారిని ఓటు అభ్యర్థిస్తే తప్పక సహకరిస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష ఐన 175కు 175 సీట్లు గెలిచి తీరుతామన్నారు. ప్రతి కార్యకర్త ఈ అంశాన్ని భుజానికి ఎత్తుకుని రానున్న నాలుగున్నర నెలలు కష్టపడాలన్నారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పార్టీ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సామాజిక బస్సు యాత్ర సభ డిసెంబర్ మొదటి వారంలో గుడివాడలో ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక నియోజకవర్గంగా గుర్తింపు ఉన్న గుడివాడ నియోజకవర్గంలో నిర్వహించే ఈ సభ రాష్ట్రానికే మోడల్ కావాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు మండలి హనుమంతరావు,దుక్కిపాటి శశిభూషణ్, నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాలఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్ప రాణి, సురేష్, జెడ్పీటీసీ జి.రామకృష్ణ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవిరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, మండల వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, నేతలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం

- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి
- క్రీడాపోటీల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న ఝాన్సీలక్ష్మి, ఇతర అధికారులు

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం విజయవంతం చేద్దామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశం హాలులో మంగళవారం నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం డిసెంబర్ 11వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు నిర్వహించబడుతుందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో, 5 స్థాయిల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటల పోటీలు ఉంటాయన్నారు. గ్రామ స్థాయిలో వలంటీర్ల సహకారం తీసుకుని క్రీడాకారులను గుర్తించాలన్నారు. క్రీడలు ప్రారంభానికి రెండు రోజుల ముందు రిజిస్ట్రేషన్లు ముగుస్తాయని, క్రీడాకారులను గుర్తించే విషయం వేగవంతం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీల సహకారంతో క్రీడలకు కావలసిన వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్రీడలకు కావలసిన నెట్‌లు, బ్యాట్‌లు, బాల్స్ తదితర సామగ్రిని ప్రభుత్వం ముందుగానే అందజేస్తుందన్నారు. ప్రధానంగా క్రీడలకు అనుకూలంగా ఉన్న గుడివాడ పట్టణంలోనే నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. అందుకు తీసుకోవలసిన చర్యలపై వ్యాయామ ఉపాధ్యాయులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల సహకారం తీసుకుని కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మద్దతు ఉంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, నందివాడ, గుడ్లవల్లేరు తహసీల్దార్లు వి. భవన్నారాయణ, అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఎంపీడీఓలు ఏవీ రమణ, వీఎస్ నాగేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనవరి 22న అయోధ్యలో విగ్రహాల ప్రతిష్ట



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కృష్ణా జిల్లా శాఖ

నిమ్మకూరు(పామర్రు): హైందవ సంస్కృతికి చరిత్రకు భారతదేశం ప్రతీకని విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ పామర్రు ప్రఖండ ప్రముఖ్ అరిగెల బాలుడు స్వగ్రహానికి మంగళవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరామ మందిరంలో స్వామి వారి విగ్రహాలు జనవరి 22, 2024న ప్రాణ ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ సమయంలో ఏక కాలంలో దేశ వ్యాప్తంగా 5 లక్షల రామ మందిరాల్లో పూజలు, దీపాలంకరణ చేసే బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోజు ప్రతి హిందువు ప్రతి ఇంటా పూజలు నిర్వహించి దీపాలంకరణతో స్వామి అనుగ్రహం పొందాలని కోరారు. సభ్యులు పీఎంఎస్ ప్రసాద్, బాలుడు తదితరులుపాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

ఉరుటూరు(పామర్రు): గ్రామానికి చెందిన కాకి శాంతి రాజు (36) ఈమధ్య కాలంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య ద్వారకకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను మంగళవారం అందజేశారు. పామర్రు మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్ రెడ్డి మాట్లాడుతూ పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాలమేరకు మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు సహాయం అందజేశామన్నారు. పార్టీ నేతలు కిరణ్, చంటి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

ఉంద్రపూడి(పామర్రు): కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా మంగళవారం నిర్వహించారు. ఉంద్రపూడి గ్రామంలోని పీఏసీఎస్ వద్ద ఈ కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. నగదు రహిత లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మురారివెంకట కుమారి, కార్యదర్శి వీరాంజనేయులు, నాయకులు మురారి దామోదరరావు, రాంబాబు కంప్యూటర్ ఆపరేటర్ సవన్ మల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తీరుతో కూలీలకు నష్టం

ద్వామా పీడీ జీవీ సూర్యనారాయణ



ప్రజా వేదికలో మాట్లాడుతున్న ద్వామా పీడీ సూర్యనారాయణ

పామర్రు: ఉపాధి హామీ పథకంలోని ఫీల్డు అసిస్టెంట్ల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి కూలీలు ప్రభుత్వం నుంచి లభించే సాయాన్ని పొందలేక పోతున్నారని ద్వామా పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరిగింది. ఈ ఏడాది మండల పరిధిలో 1230 పనులు చేసి రూ.5.52 కోట్లు కూలీలకు చెల్లించినట్టు తెలిపారు. ఈ వేదికలో ఫీల్డు అసిస్టెంట్ల అవగాహన లోపంతో ఉపాధి పనులు చేసే కూలీలతో కనీసం 100 రోజులు పనులు చేయించలేక పోయారన్నారు. కూలీలు 100 రోజులు పనుల పూర్తిచేస్తే వారి కుటుంబంలో చదువుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా శిక్షణలు, ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి జీవన భృతికి సహకరిస్తోందని తెలిపారు. దీనికి కారణం ఆయా గ్రామాల్లో ఫీల్డు అసిస్టెంట్లేనని చెప్పారు. దీనికి మండల ఏపీవో, ఈసీ, టీఏలు కూడా బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీలు రమణారావు, నాంచారరావు, డీవీవో శ్రీలత, ఎం.చిన్నబ్బాయి. పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో వై.రామకృష్ణ, మండలంలోని 25 గ్రామాల ఎఫ్ఏలు, మేట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బాణసంచా విక్రయించండి



పామర్రులో దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ సుభాకర్

గుడివాడరూరల్: టపాసులు విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి టపాసుల విక్రయాలు నిర్వహించుకోవాలని గుడివాడరూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఏసోబు పేర్కొన్నారు. స్థానిక తాలూకా సిఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో గుడివాడ రూరల్ సర్కిల్ పరిధిలోని గుడివాడరూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో లైసెన్స్‌లు లేకుండా టపాసులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం, అధికారుల నుంచి లైసెన్స్‌లు పొందిన విక్రయదారులు నిబంధనలకు లోబడి విక్రయాలు నిర్వహించాలని సూచించారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమతులు తప్పనిసరి

దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా అమ్మే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని లేని పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడివాడ టూటౌన్ సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డిఎస్పీ పి.శ్రీకాంత్‌ల ఆదేశాల మేరకు పట్టణంలో అనుమతులు లేకుండా టపాసుల విక్రయాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనల ప్రకారం విక్రయాలు చేసుకోవాలని సూచించారు.

పమిడిముక్కల: అక్రమంగా మందు గుండు సామగ్రి నిల్వచేసినా, విక్రయించినా చర్యలు తీసుకొంటామని పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కిషోర్‌బాబు షాపుల యజమానులను హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా మండల పరిధిలోని పలు షాపులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాణసంచా విక్రయ ప్రదేశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. పమిడిముక్కల సర్కిల్ పరిధిలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పమిడిముక్కల, తోట్లవల్లూరు ఎస్ఐలు, సిబ్బందికి దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసేవారు విద్యుత్, అగ్నిమాపక, పోలీస్‌శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆనందరావు పాల్గొన్నారు.

పామర్రు: అనుమతి లేకుండా టపాసులు నిల్వ ఉంచిన వారిపై చర్యలు తీసుకుంటామని పామర్రు సీఐ వీ సుభాకర్ అన్నారు. మండలంలో పలు దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా టపాసుల నిల్వలు ఉన్నట్లు గుర్తిస్తే 9440797431 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా నిల్వల స్వాధీనం

గుడివాడ టౌన్(నందివాడ): మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.10 వేలు విలువచేసే లైసెన్స్ లేని బాణసంచా నిల్వలు స్వాధీన పర్చుకున్నట్లు నందివాడ ఎస్ఐ శిరీష మంగళవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టామని, దీపావళి పూర్తయే వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. మండలంలోని జనార్ధనపురం, పుట్టగుంట, లింగాల, నందివాడ, తుమ్మలపల్లి, కుదరవల్లి, తమిరిశ తదితర గ్రామాల్లో అక్రమ బాణసంచా నిల్వలు తనిఖీ చేశారు.

కూచిపూడి(మొవ్వ): అనుమతులు లేకుండా టపాసులు విక్రయించ రాదని కూచిపూడి ఎస్ఐ డీ సందీప్ హెచ్చరించారు. మండలంలోని కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు దుకాణాలను ఎస్ఐ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమతిలు లేనిదే టపాసులు విక్రయించ రాదని, ఇంటి వద్ద ఎవరైె టపాసులు తయారు చేయటం, నిల్వ ఉంచటం గాని చేయకూడదన్నారు. అలా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం -చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. జిల్లాలోని పలుప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారి పుట్టలో పాలుపోసి, దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో 150 మంది భక్తులు అభిషేకాలు చేయించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు, చినపాలపర్రు గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈ సదస్సులు జరిగాయి. ముదినేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వేత ఈ సదస్సులో పాల్గొని ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. లింక్ వర్కర్స్ సూపర్‌వైజర్ బి.రాకేష్ హెచ్ఐవి రహిత గ్రామాలుగా మార్చుకునేందుకు ప్రజలు కృషి చేయాలన్నారు. సదస్సుల్లో లింక్ వర్కర్ జన్ను చంద్రావతి, వైద్య సిబ్బంది శరణ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పొలంబడి

మండవల్లి: అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. వరి పొలాల్లో ఎటువంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించారో చర్చించారు. డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ సిబ్బందికి పంట కోత ప్రయోగంపై శిక్షణ అందించారు. ఇన్‌చార్జి నాగవిజయ, ముదినేపల్లి మండల ఇన్‌చార్జి నారాయణ, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు రక్షణ కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు

గుడివాడ టౌన్: ఆర్‌ఎంపీ వైద్యులకు రక్షణ కల్పించాలని ఆర్‌ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌ఎంపీడబ్ల్యూఏ) కృష్ణా జిల్లా అధ్యక్షుడు నందూరి ఉమాశంకర్ కోరారు. మంగళవారం ఆర్‌ఎంపీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో పట్టణంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ పి.పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ రాత్రి ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కంచెరవారి పల్లెలోని ఆర్‌ఎంపీ వైద్యుడు అజయ్ కుమార్ క్లినిక్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సాగిరాజు ఉదయ భాస్కరరాజు, కోలా వెంకటేశ్వరరావు, జీఎస్ చంద్రశేఖర్, జీవీ లక్ష్మీ నారాయణ, చంటి, ఎర్రంనాయుడు, విజయ, శిరీష పాల్గొన్నారు.

మండవల్లి: ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కంచర్లవారిపల్లిలో ఆర్‌ఎంపీ అజయ్‌కుమార్ క్లినిక్‌పై దుండగులు దాడి చేసి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడం అమానుషమని ఆ సంఘ కైకలూరు ఏరియా కమిటీ సభ్యులు అన్నారు. మండలంలోని లోకుమూడిలో మంగళవారం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్రెటరీ లంకపల్లి రవి, కోశాధికారి జీ జనార్దనరావు, లాజరు, డి బాలరామమూర్తి, బి రమేష్, బి శేషుబాబు, గౌరవ అధ్యక్షుడు ఎ.అశోక్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్: అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయ భవన నిర్మాణాలు 80 శాతానికి పైగా ప్రారంభానికి నోచుకోగా మిగిలినవి నిర్మాణదశలో ఉన్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యరంగాల్లో మండలాన్ని ప్రగతిపథంలో నిలపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయిస్తున్న నిధులను స్థానిక ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలన్నారు. ఎంపీడీవో పీ మల్లీశ్వరి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, తహసీల్దార్ కే శ్రీనివాస్, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, ఎంఈవో కే నరేష్‌కుమార్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కైకలూరు: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పుల వల్ల క్యాన్సర్ కారకాలు జనిస్తున్నాయని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టరు బి.రఘునాథరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ కేన్సర్ డే సదర్భంగా అవగాహన సదస్సు కాలేజీ జంతు శాస్త్ర విభాగం, ఆక్వాకల్చర్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతిరోజు యోగా, మంచి పౌష్టికాహారం, సక్రమమైన నిద్ర, సమయానికి వ్యాయామము చేయాలని సూచించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.సంధ్య మాట్లాడుతూ సెప్టెంబరు 2014లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తొలిసారిగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని ప్రారంభించారని చెప్పారు. డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బోటనీ విభాగాధిపతి జ్ఞాన ప్రసూనాంబ, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, విద్యార్థులు హాజరయ్యారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పమిడిముక్కల: ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయా లని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోరారు. వీరంకిలాకు ఇరిగేష న్ బంగ్లాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాది గల విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగ, మాదిగ ఉపకులాలు ప్రజలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి చంద్రపాల్, కొడమంచిలి మహేష్, తోడేటి ముత్తయ్య, సిద్ధిల జయరాజు, దొండపాటి డేవిడ్, నియోజకవర్గ కన్వీనర్ గంధ్రపు రాకేష్, మండల కన్వీనర్ వేల్పూరి మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు అఖండ అన్నసమారాధన

కైకలూరు: స్థానిక శ్యామలాంబ దేవస్థానం వద్ద చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబరు 15 నుంచి 24వ తేదీ వరకు అత్యంత ఘనంగా జరిగాయి. ముగింపు సందర్భంగా అమ్మవారి దేవస్థానం వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు అఖండ అన్నసమారాధన జరుగుతోందని ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్ మంగళవారం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నసమారాధనను ప్రారంభిస్తారన్నారు. ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో కోరారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

పామర్రు: పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని పామర్రు నియోజకవర్గ ఈఆర్వో షేక్ సాహెద్ బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీఎల్‌వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,830 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈనెల 4,5 తేదీల్లో జరిగిన స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 972 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తహసీల్దార్లు వీవీ భరత్‌రెడ్డి, నాగభూషణం, రాజ్యలక్ష్మి ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సిబ్బంది రాము, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సరైన బోధనతో ఉత్తమ ఫలితాలు

ముదినేపల్లి రూరల్: విద్యార్థులకు సరైన విధానంలో బోధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ శేవ్యానాయక్ అన్నారు. మండలంలోని చినపాలపర్రు ప్రాథమిక పాఠశాలను మంగళవారం వార్షిక తనిఖీ చేశారు. విద్యార్థులను పలు సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి అభినందించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్ఎం వి.ప్రసన్నకుమారి, ఉపాధ్యాయురాలు మీనా, సీఆర్పీ విజయదుర్గ, పాల్గొన్నారు.